# ఆచార్య దేవోభవ

'విజయా మఘాలా' అన్న బోర్డు నాలుగు చక్రాల బండి మీద జిగ్గున మెరుస్తోంది. దూరం నుంచీ దాని వాసన గుప్పుమని అటూ ఇటూ తిరిగేవారికి పసందుగా ఉంటుంది. బొంకుల దిబ్బ కెదురుగా జనాలు పోగయ్యే అయిదారు ముఖ్య కేంద్రాలలో యువకులు ఆదరించే స్థలం ఇది బండి చుట్టూ నుంచుని బాగా పొద్దుపోయే వరకూ కాలక్షేపం చేయడానికి ఇంత కంటే మంచి వాతావరణం అక్కడ మరేమీ లేదు. ఛాట్ వ్యాపారం ముఖ్యంగా సాయంకాలం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ సాగుతుంది.

ఆ వ్యాపారం వెనుక ఒక బడ్డీ కందకం పూడుకుపోయిన తరువాత ఆ స్థలంలో రకరకాల బడ్డీలు, రకరకాల వ్యాపారాలు వచ్చాయి. అందులో పుస్తకాలూ, పత్రికలూ అద్దెకిచ్చే ఓ సర్క్యులేషన్ లైబ్రరీలాంటిదీ వెలిసింది.

" ఏ కోయీ ఘూమ్‌నేకీ జాగా హై ? కైసే లోగ్ హైయే సబ్!" ఆ అమ్మాయి మొదటి రెండు రోజులూ చూసి అడిగింది.

" ఈ ఊళ్లో మనుషులకు ఇది పార్కులా ఉందేమో ! రోడ్డు కిరువైపులా ఇలా బాతాఖానీ!" అంటూ అమ్మాయి చేసిన వ్యాఖ్యని తెలుగులో వివరించాడు ఆంధ్ర మహానగరి నివాసి ఆమె అన్న.

" ఇది మహారాజు పట్నం ఇక్కడ మాటలే కోటలు దాటుతాయి. కబుర్లంటే చెవులు కోసు కుంటారు. మావాళ్లు పనంటూ ఉంటే, ఉద్యోగం అంటూ దొరికితే చేసేయలేకపోతామా అనే ధీమా! లోకాభిరామాయణమంటే మా చెడ్డ మక్కువ !" మారాజు పట్నవాసి తన ధోరణిలో చెప్పేశాడు.

ఏవో ముళ్లు గుచ్చుకుంటున్నట్టు తెగ ఇబ్బంది పడిపోతోంది ఆ అమ్మాయి. చుట్టుపక్కల నుంచుని చూస్తున్న వాళ్ల కళ్లు ఆమెను గుచ్చేస్తున్నాయని అతనికి తెలుసు. అతనికి విజయనగరంలోని దేదీ వింత అనిపించదు. అక్కడే పుట్టి అక్కడే మూడవ పది మీద వేసుకో బోతున్నాడు.

" నేను చెల్లాయిని ఇంటిదగ్గర దిగబెట్టి వస్తాకానీ, నీకు కావలసిన ఫారం ఇక్కడే దొరుకుతుంది ! " అంటూ లైబ్రరీ బడ్డీ చూపించి మరీ వెళ్లిపోయాడు విద్యలనగర నివాసి.

"రెండు సంచికల ముందు ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో పదిహేను వందల ఖాళీలేవో పడ్డాయట! ఉన్నచోటు ఉండకుండా తిరుగుతున్నా నాలుగు వారాల నుంచీ" అంటూ బల్ల మీద చెయ్యి ఆనించి అడిగాడతను.

" అలాగా! ఉండండి, ఇదీ ప్రకటన పడ్డ సంచిక. అప్లికేషన్ ఫారం, కవరు – అన్నీ కలిపి ఐదురూపాయలు మాత్రమే !"

చుట్టూ చూశాడు ఊరికి కొత్తగా వచ్చినతను.

రోడ్డు మీదే ఓ బోర్డు లాంటిది స్టాండుకు అమర్చబడి, దాని మీద చాలా ప్రకటనలు అతికించబడి ఉన్నాయి.

'' మీ దేవూరు సార్!'' బడ్డీ ఆయన అడిగాడు. ఆ గొంతులో ఏదో ఆదరణ.

'' మాది హైదరాబాదు ఈ ప్రాంతాలు ఎప్పుడూ చూడలేదని, మా చెల్లాయికి చూపించే అవకాశం ఇదేననీ తీసుకొచ్చాను!''

కోలాహలంగా విద్యార్థులు కొందరు కాలేజీ రోడ్డుమీద నుంచి కస్బా వైపు వెళ్తున్నారు.

'' మూర్తీ ! డౌన్! డౌన్!'' కేకలు, వెక్కిరింతలు, వేళాకోళాలు.

'' ఆడపిల్లల్ని కూడా మనవెంట తీసుకు వచ్చి ఉంటే బాగుండేది. అసలా ముసలాడికి ఎలాగోలా బుద్ధి చెప్పాలి !''

రాజధాని పౌరుడు విద్యార్థులవైపు నిదానంగా చూస్తూ, చెవులు రిక్కించుకుని వాళ్ల మాటలు వింటూ ... ఆకళింపు చేసుకోడానికి చేస్తున్న ప్రయత్నాన్ని లైబ్రరీ నాగభూషణం చూశాడు. అయినా ఆ కుర్రవాడిని ఇక మాట్లాడించదలచుకోలేదు.

గుంపులోని విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అడపా, తడపా అధ్యాపకులూ ఆ తోవన వస్తున్నారు. ఒక్కొక్కరంటే విద్యార్థులకు కొంత గౌరవం, కొందరంటే ఎగతాళి, ఒక్కొక్కర్ని చూసి విద్యార్థులు గప్‌చుప్ అయిపోవడమూ కనపడుతోంది.

మరో పదినిముషాలలో కోలాహలం పెరిగింది.

'' ఆయన ప్రవర్తనకు నిరసన. ఎంత పెద్దాడైతే మాత్రం కొట్టడమే !'' ఒక కుర్రాడు విషయమేమీ తెలియనట్టు కనబడుతున్న మరొకడితో చెబుతున్నాడు.

'' రేపు ఇరవై మూడవ తారీఖు గడువు ముగిసే తేదీ. ఇవాళ అప్పుడే ఇరవై ! మరి అప్లికేషన్ హైదరాబాదు ఎలా వెళ్తుందీ !'' రాజధానివాసి తెల్లమొహంతో నిట్టూర్చడం నాగభూషణం చూశాడు.

'' చూడండి ! అసాధ్యం కాదు. కొరియర్ ఒకటి వచ్చిందిగా ! పోస్టులో రెండవరోజు వెళ్లేవి. ఇప్పుడు వారం రోజులు కూడా పడుతున్నాయి. ప్రగతి ఇదే ! కానీ మీరు నాకు రేపు సాయంకాలానికి ఇస్తే మొత్తం అన్నింటితోనూ ఓ మనిషి వెళ్లి హైదరాబాదులో అందజేస్తాడు. మరొక్క పది మాత్రం అవుతుంది. నిరుద్యోగులం ఒకరికొకరు సాయం ...! ''

'' రక్షించారు మీరు చేసే సేవ నాకు చాలా నచ్చింది. మీరు ...''

'' బియ్యే పాసై ఉద్యోగాలకు దరఖాస్తులు పంపుతూ ప్రైవేటుగా ఎమ్మే చేశాను. వయస్సయిపోయింది. ఇక పంపే శ్రమే లేదు. అక్రమ ఆక్రమణలంటూ కొన్ని బడ్డీలను తొలగించి ఒక ఖాళీ జాగాలో పడేశారు. ఏదో ఒకటి చేయడం అవసరమై ఓ పదిమందిమి కలిసి ఓ పాత బడ్డీ. ఇదే ! కొన్నాం. తలా కొంతా వేసుకుని ఈ వ్యాపారం ప్రారంభించాం. మా జట్టులో ముగ్గురికి ఉద్యోగాలొచ్చాయి. మా ఖాతాదారుల్లో విద్యార్థులూ ఉన్నారు. నిరుద్యోగులూ ఉన్నారు. గృహిణులూ ఉన్నారు. పెద్దలూ ఉన్నారు. కుర్రకారుల్లో పెద్దవాణ్ణి నన్ను మా వాళ్లంతా 'బాబాయ్' అని పిలుస్తారు. ఈ ఛాట్ మసాలా కొట్టు మా జట్టు వాడిదే. మీ ఊళ్లో ఇలాంటివి...''

'' ఉన్నాయి కాని మీకు మదుపు ?'' రాజధాని వాసి మనసులో ఆలోచన నాగభూషణానికి అర్థమైంది.

'' మంచివాళ్లెప్పుడూ ఉంటారు. ప్రయత్నమంటూ చేస్తే ఎప్పటికైనా ఫలితం సాధించవచ్చు.

ఈ గందరగోళం చూస్తున్నారుగా ! మీ కేమనిపిస్తోంది ?''

'' చదువు ఊరికే వస్తుంటే, ఖర్చులు ఇంకెవరో భరిస్తుంటే ముప్పూటలా ప్రయత్నం లేకుండానే కంచాలు అమరిపోతూ నిష్పూచీగా కాలం వెళ్లిపోతూంటే కాలేజీలో చదువు కంటే సుఖమైనది మరొకటి లేదు. ఇంతకీ ఎవరా మూర్తి ? ఏమైందసలు ? ''

'' ఆయన ముప్ఫై ఏళ్లు సర్వీసు చేసిన ఒక సీనియర్ లెక్చరర్ ! 'ఇలాగేనా రాయడం' అని జబ్బ మీద ఇలా అన్నారట మొన్ననెప్పుడో ! కొంచెం ఉద్రేకపరులని అనుకుంటారు. మాకూ ఆయన లెక్చరరే ! నేనింత పిల్లవాణ్ని దగ్గర నుంచి ఆయనకు తెలుసు.''

'' స్లోగన్లు రాయాలి. మరొక నలుగురు కావాలి. వాడి దగ్గర కెళ్తున్నాం. అదే మన మల్లిక్ గాడి దగ్గరకి. హాస్టల్ వరకూ రారాదూ !''

వడివడిగా వెళ్తున్న ఓ కుర్రవాడి ఈ మాటలు సంభాషణలో ఉన్న ఇద్దరి చెవినా పడ్డాయి.

'' వీళ్లకేం పోయాకాలం !''

నాగభూషణం ఆవేశం చూసి ఆశ్చర్యపోయాడు రాజధాని యువకుడు.

నాగభూషణం మరి ఉండలేకపోయాడు.

'' చూశారా వీళ్ల ధైర్యం ! ఆయన సంగతి నాకు తెలుసు. నేను ఆయన దగ్గర చదుకున్నాను. ఎప్పుడంటారూ ... హైస్కూల్లో ! అక్కడనుంచే ఆయన మేడ మెట్లెక్కి కాలేజీలోకి వెళ్లారు. నిలబడే ఉన్నారు రండి !'' అంటూ స్టూలు చూపించాడు.

'' నేను టెన్త్ చదువుతుండగా జరిగిందది. వాళ్లింట్లో ఓ ఇరవైమందిమి చదువుకునేవాళ్లం. అదే ట్యూషననుకోండి ! కంబైన్డు స్టడీ అనుకోండి ! ఓ రోజు రాత్రి పిల్లలం గలాభా చేస్తూంటే ఆయన చేతికందిన వేవో విసిరారు. నా తల బొప్పి కట్టింది. మేమెవరమూ కిక్కురుమనలేదు. ఎక్కడ వాళ్లం అక్కడ గప్‌చుప్ !

'' మరుసటిరోజు ఆయన మా పెద్దనాన్న దగ్గరకొచ్చారు. మా నాన్నగారు చిన్నప్పుడే పోయారు. ఐదేళ్ల కిందట మా పెద్దనాన్నగారూ పోయారు. మాస్టారిని అరుగు మీద కుర్చీలో ఆసీనుణ్ణి చేసి, '' ఏం మూర్తీ ! ఏమిటి సంగతి ? అన్నారు పెద్దనాన్న.

'' నేను గోడవార నక్కేశాను. మాస్టారంటే భయమనే కాదు, ఆయన కంట పడటం అట్టే ఇష్టముండేది కాదు. అదొక మాదిరి భక్తి భయమంటే భయమైనా అనవచ్చు. ప్రేమతో నిండిన గౌరవం.''

'' చూడండీ, పంతులుగారూ ! ఏదో కోపంతో.... వాడిని కొట్టాలని కాదు నాఉద్దేశం.... వెధవాయికి బొప్పి కట్టేసింది. మీకు చెప్పాడా ? నన్ను క్షమించండి !''

''మాస్టారు కొడితే చెప్పడమా ! బాబూ ! వాడు మీవాడు. మావాడు – అంత ధైర్యం....!''

''అంతే ! మాస్టారు వెళ్లిపోయారు. ఆయన రావడంలోని ఆంతర్యం మీకు తెలిసే ఉంటుంది. తల్లీతండ్రీ లేని వాణ్ని కొట్టానే అని మాస్టారి మనసు విలవిల్లాడిపోయింది. ఆ రోజులు వేరేమో ! చదువుకోడానికి ఇప్పుడున్నన్ని వెసులుబాటులూ, సదుపాయాలూ, లేవు. మా పెద్ద నాన్నగారికి సంజాయిషీ చెప్పుకోడానికి వచ్చిన ఆ మాస్టారికే ఈ రోజు ఈ కుర్రకారులు చేస్తున్న గౌరవం ఇది !'' నాగభూషణం గొంతు లో జీర.

" దీనికి కారణం కేవలం ఆయన స్టూడెంట్ మీద చెయ్యి వేయడం కాకపోవచ్చేమో ! హైదరాబాదతను అన్నాడు.

" అదీ తెలుసు . ఓ కొత్త లెక్చరర్‌కు ఈయనంటే మంటట ! ఆయన వాడిని గొడ్డించరని కసి !"

" పోనీ మీరు మాస్టారి గురించి ఆ కొత్తాయనకు చెబితే ?"

" మీ స్పందనకు కృతజ్ఞతలు నేను తెలివితక్కువై ఆపని చేయబట్టే నామీద కసి పెట్టుకుని మాస్టారి మీద ఈ దాడి చేయిస్తున్నాడు ఆ ప్రబుద్ధుడు. సరే రేపటికీ గొడవ సద్దుమణుగు తుంది లెండి ! మీ అప్లికేషన్ రేపివ్వండి. భద్రంగా పంపించేస్తా !"

నాగభూషణం మాటలలోని నిశ్చయం, దాని వెనక ఉన్న గురి, దాని తీక్షణత చూసి, అతనికి మనసులో వందనాలర్పించాడు భాగ్యనగరివాసి.

**ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక**
అక్టోబరు 26 -1 నవంబరు 1994